క్లుప్తంగా

చేయూత



తరిగొప్పుల: బొత్తలపర్రె గ్రామానికి భూక్య లక్ష్మణ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, మృతుడి కుమారుడు సంపత్‌తో కలిసి చదువుకున్న 2008–09 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నేహం కోసం ఫౌండేషన్ తరపున రూ.10వేల నగదును లక్ష్మణ్ కుమారుడికి ఆదివారం అందజేశారు. చింతల జైపాల్,అంకం రాజు, సురేందర్, వేణు, జూడో శ్రీను, రామకృష్ణ, రాజు, శరత్, తిరుపతి, శ్రీను, సంపత్, బాలు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా దిలీప్‌కుమార్



పాలకుర్తి టౌన్: తెలంగాణ ప్రైవేట్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండల కేంద్రంలోని సుధా టెక్నో స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పోలాస దిలీప్‌కుమార్ ఆదివారం హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్‌ను ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, సుధా టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక విజయ్‌కుమార్ అభినందించారు.

పరామర్శ



నర్మెట: ఆగాపేటకు చెందిన వల్లంపట్ల వజ్రమ్మ (70) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, కొంరె వెంకన్న, గ్రౌరబోయిన కరుణాకర్ ఉన్నారు.

మచ్చుపహాడ్‌లో..



నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ కొంపెల్లి ఎల్లయ్య (65) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనలతో పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడి పార్టీ శ్రేణులతో కలసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు టీఎల్ఎం మేళా

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎస్వీ గార్డెన్‌లో నేడు (సోమవారం) ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు టీఎల్ఎం ప్రదర్శన నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ మేళా కార్యక్రమానికి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు బోధనాభ్యాసన సామగ్రితో ప్రదర్శనకు హాజరు కావాలని తెలిపారు. అలాగే గురుపూజోత్సవం పురస్కరించుకుని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే

తొర్రూరు: దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ప్రారంభమవుతుందని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు అన్నారు.ఆదివారం డివిజన్ కేంద్రంలోని నితిన్ ఫౌండేషన్‌లో మండల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జెల్ల లక్ష్మీనారాయణ, పోగు శ్రీను, తుమ్మ వెంకటేశ్వర్లు, మిర్యాల సతీష్‌రెడ్డి, కొరివి సుధాకరాచారి, వెంకటేశ్వర్ ప్రభాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి నిలువెత్తు రూపం రావి నారాయణ రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం రావి నారాయణ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కొనియాడారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేరుకే చిల్పూరు మండలం

- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



చిల్పూరులో తహసీల్దార్ కార్యాలయం



గుట్ట కింద ఉన్న పోలీస్ స్టేషన్

చిల్పూరు: జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త మండలాలను ఏర్పాటు చేస్తున్నట్లు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించగానే ఆనందం వ్యక్తం చేసిన మండల ప్రజలు నేడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం మండల కేంద్రంలో కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రైవేట్, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పనులపై వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి కూర్చునే స్థలం, కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. 2017 అక్టోబర్‌లో కొత్త మండలాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చిల్పూరుగుట్ట కింద ఆలయానికి సంబధించిన సత్రాల్లో పోలీస్‌స్టేషన్, చిల్పూరులోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ, వెలుగు కార్యాలయం, మల్కాపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి ఇలా ఒక్కొక్కటి ఒక్కో చోట అద్దెభవనాల్లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గుట్ట కింద నుంచి కార్యాలయాలకు రావాలంటే వాహన సౌకర్యం కూడా లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో ఒకేచోట అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పలుమార్లు వినతిపత్రం అందజేశారు. కాగా, ఎమ్మెల్యే స్పందించినప్పటికీ స్థల సేకరణ మాత్రం జరగడం లేదు.

మండల కేంద్రంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోనే అన్ని కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి.

- వేముల రవి, చిల్పూరు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా..



అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మండల కేంద్రంలో ఉంటేనే ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరించేందుకు పాటుపడుతా.

-పొట్లపల్లి శ్రీధర్‌రావు, చిల్పూరు ఆలయ చైర్మన్

లంబాడీల మనోభావాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం



నినాదాలు చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు



కొడకండ్ల: మాట్లాడుతున్న గిరిజన నాయకులు

దేవరుప్పుల: భారత రాజ్యాంగం లంబాడీలకు కల్పించిన 324 ఆర్టికల్ కాదని ప్రస్తుత పాలకులు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని లంబాడీల జాయింట్ యాక్షన్ కమిటీ మండల కన్వీనర్ ధరావత్ రామ్‌సింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనెల 9వ తేదీన వరంగల్‌లో తలపెట్టిన లంబాడీల శాంతి ర్యాలీ జయప్రదం కోసం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బానోత్ మహేందర్, రాజన్న నాయక్, భూక్య శ్రీను, నియోజవర్గ కన్వీనర్ ధరావత్ జై సింగ్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వీరేష్ , ఉమ్మడి జిల్లా ఉద్యోగుస్తుల కో కన్వీనర్ కిషన్, నాగరాజు, నవీన్, గణేష్, మహేష్, కాల్ రామ్, లాలు, జహీందర్, ఆనంద్, రవి, మంగ్త నాయక్ పాల్గొన్నారు.

9న లంబాడీల శాంతియుత ర్యాలీ

కొడకండ్ల: ఈ నెల 9న వరంగల్‌లో లంబాడీల శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గిరిజన నాయకులు మహేందర్, శ్రీనునాయక్, అభిమన్‌గాంధీ నాయక్‌లు తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో వీరేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ బాబురావు తదితరులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 342 ప్రకారమే లంబాడి జాతిని ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగిందని, వెంకట్రావ్, బాబురావుల ఆరోపణలు నిజం కాదని లంబాడి జాతి మనోభావాలను దెబ్బతీసే విధంగా వారు వ్యవహరిస్తూ జాతుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు జైసింగ్, కిషన్‌నాయక్, రామ్‌సింగ్, నాగరాజు, మంగ్యానాయక్, సాయికుమార్, నాగన్న, వీరునాయక్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పాలకుర్తి : గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాఘవపురంలో బాలవికస ఆధ్వర్యంలో నీటి శుద్ధీకరణ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడారు. గ్రామస్తులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో గ్రామ అభివృద్ధి కోసం ముందుకు రావాలని పిలుపున్చిరు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో నీటి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను మహిళలతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలమోహన్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ గుండె బాబు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధరావత్ దేవ్ సింగ్‌కు డాక్టరేట్



దేవరుప్పుల: మండలంలోని బంజర గ్రామానికి చెందిన ధరావత్ దేవ్‌సింగ్‌కు డాక్టరేట్ రావడం పట్ల బంజర గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని బంజర గ్రామానికి చెందిన ధరావత్ బీలు కొడుకు దేవ్ సింగ్ జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా విద్యనభ్యసించి అదే విశ్వవిద్యాలయం నుంచి ఫిలాసఫీలో డాక్టరేట్ పట్టా పొందారు. ఈ మేరకు ఆదివారం బంజర గ్రామంలో ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామచంద్రునాయక్, బాశెట్టి సోమయ్య, మెండగుజ్జుల శేఖర్, కేవులోత్ రాజేందర్, సంగి కర్ణాకర్, దేవర వీరన్న, గవ్వల మహేందర్, ధరవత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలో గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలని సీఐ వేణుగోపాల్ అన్నారు. వరంగల్ సీపీ, వెస్ట్ జోన్ డీసీపీల సూచనలతో సిబ్బంది నిమజ్జనం మొదలుకొని పూర్తి, అయ్యే వరకు ఉండగా నిర్వాహకులు కూడా సహకరించారని అన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. మండలంలోని కోమళ్ల ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల వైఫల్యంతో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, గ్రామ అధ్యక్షుడు బొల్లపల్లి కుమారస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

జఫర్‌గఢ్: మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను జిల్లా ఆర్యవైశ్య మహాసభతో పాటు మండల ఆర్యవైశ్య సంఘం ఆదివారం ఘనంగా సత్కరించింది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు అంచూరి సురేష్, బెలిదె స్వాతి, బజ్జూరి సుకృతను శాలువలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని పేర్కొన్నారు. సంఘం మండల అధ్యక్షుడు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్, గందె సోమన్న, బోనగిరి శ్రవణ్‌కుమార్, బజ్జూరి సంతోష్, బోనగిరి నాగరాజు, బెలిదె హరిశంకర్, బజ్జూరి చలమయ్య, శ్రీను, సుధీర్ పాల్గొన్నారు.

అంజన్న మృతి తీరని లోటు



అంజన్నకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు శివార్ల అంజన్న (60) మృతి సీపీఐకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడనే సమాచరం తెలుసుకున్న ఆయన పార్టీ నాయకులతో ఇబ్రహీంపూర్ చేరుకొని మృతదేహాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూల మాలలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సీపీఐ నాయకులు బొప్పరి సోమయ్య, చంద్రయ్య, పండుగ మల్లేశం, పులి మల్లేశం, వెంకన్న, చింత సుధాకర్; యాదగిరి, శ్రీను, మల్లేష్, శ్రీను, కుమార్, రామచందర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం



తల్లీబిడ్డలతో వైద్యబృందం

దేవరుప్పుల: ప్రథమ చికిత్సలకు పరిమితమవుతున్న నానుడికి భిన్నంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణికి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కలిసి సాధారణ ప్రసవం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆదివారం పెద్దమడూరు గ్రామానికి చెందిన గోకారపు కావ్యకు పురిటినొప్పులు రాగా సింగరాజుపల్లి ఆరోగ్య ఉపకేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ఏఎన్ఎం సుజనా ఆమె ఆరోగ్య పరిస్థితి పరిశీలించి ధీమాతో జనగామకు బదులు అంబులెన్స్‌లో దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పీహెచ్‌సీ డ్యూటీ వైద్యురాలు వెంకటలక్ష్మితో కలిసి సాధారణ ప్రసవం చేయగా ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా తొలికాన్పులో కూతురు జన్మించింది. పుట్టిన బిడ్డ ఆరోగ్యస్థితుల కోసం వెంటనే ఎంసీహెచ్ చంపక్‌హిల్స్‌కు తరలించి తిరిగి పీహెచ్‌సీలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. వైద్యచికిత్సలు అందించిన వారిలో 108 ఈఎంటీ కళ్యాణీ, ఆశ వర్కర్ సరిత, సిబ్బంది కవిత తదితరులు ఉన్నారు.

‘స్థానికం’లో కాషాయ జెండా ఎగురవేయాలి



నర్మెట: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



పాలకుర్తి: మాట్లాడుతున్న రవి



దేవరుప్పల: మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

నర్మెట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాషాయ జెండా ఎగురవేయాలని సంయోజక్ కొయ్యడ నవీన్ గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ సూచనలతో మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో ప్రవాస్ సంపర్క్ యోజన పల్లెపల్లెకు బీజేపీ, గడపగడపకు కార్యకర్త కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంతో పాటు గండిరామారంలో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ అంకుగారి శశిధర్‌రెడ్డి, జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: దేశం మరింత అభివృద్ధి పథంలో నడవాలంటే నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మండల సంయోజక్ దండ్యాల భిక్షపతి అన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన అంకుషాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ ప్రచారం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఎడెల్లి రాంనర్సింహారెడ్డి, తలకొక్కుల శ్రీనివాస్, జీల సతీష్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ జెండాను ఎగురవేయాలని పార్టీ మండల సంయోజక్ వడ్లకొండ రవి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొంగరి మహేంద్, దుంపల సంపత్, మారం రవి, వేల్పుల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

దేవరుప్పుల: బీజేపీ ప్రభుత్వంతోనే శాశ్వత ప్రాతిపదికన పారదర్శకతతో కూడిన దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంమోహన్‌రెడ్డి అన్నారు. మాధాపురం, కోలుకొండ, పడమటితండా తదితర గ్రామాల్లో సంపర్క్ అభియాన్ యోజన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పీఎం మోదీ ఇంటింటా అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బస్వ భాస్కర్, సంపర్క్ యోజన మండల కన్వీనర్ వాసు,స్థానిక సంస్థల ఎన్నికల ప్రభారీ రంగు రాములు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన యాదగిరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాలకుర్తి–స్టేషన్ ఘన్‌పూర్ రోడ్డులో ఇప్పగూడెం డీజిల్ బంక్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విశ్వనాథపురం గ్రామానికి చెందిన కంజర్ల యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహన సిబ్బంది ఈఎంటీ హరికృష్ణ, పైలట్ రాజన్నలు అందించిన వివరాల ప్రకారం.. సముద్రాల నుంచి స్వగ్రామమైన విశ్వనాథపురానికి ద్విచక్రవాహనంపై వస్తున్న యాదగిరిని డీజిల్ బంక్ సమీపంలో వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సందీప్ గౌడ్ (ఫైల్)

దేవరుప్పుల : తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మంది తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. కడవెండికి చెందిన కందుల సందీప్‌గౌడ్ (22) కులవృత్తితోపాటు ఇతర కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ తండ్రి రాములు ఇంటి వ్యవహారాలకు డబ్బులు ఇవ్వకుండా దుబార ఖర్చులు పెడుతున్నావని సందీప్‌ను మందలించడంతో మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండ ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

జఫర్‌గఢ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రాదేశిక ఎన్నికల సంబంధించిన అంశాలపై రాజకీయ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల 8వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపీడీఓ సుమన్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన ఓటరు ముందస్తు జాబితా, పోలింగ్‌స్టేషన్ల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడం జరుగుతుందన్నారు. నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

భూమిపూజ



పాలకుర్తి: ఈరవెన్ను గ్రామంలో రూ.2లక్షలతో నిర్మిస్తున్న ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు హబీబ్, అహ్మద్, మాజీ సర్పంచ్ కొమురోజు సోమన్న, ముస్కు చంద్రబాబు, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి సత్తిరెడ్డి, గోనె మహేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోనె అశోక్ పాల్గొన్నారు.


బియ్యం అందజేత




తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాటెల్లి ఇస్సాకు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను సింగిల్ విండో మాజీ చైర్మన్ అర్జుల సుధాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. చిలువేరు సంపత్, దామెర థామస్, గాలయ్య, ప్రసాద్, ప్రతాప్, మైఖేల్, బాలస్వామి, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

కోతులతో పరేషాన్

బచ్చన్నపేట: గ్రామాల్లో కోతులు పరేషాన్ చేస్తున్నాయి. పంట చేలను కూడా వదలడం లేదు. గ్రామంలోని పాత పెంకుటిళ్ల పెంకులను తొలగించి చిందర వందర చేస్తున్నాయి. దీంతో వర్షాలకు ఇళ్లపై గ్రామస్తులు కవర్లు కప్పుకుంటున్నారు. అలాగే ఇళ్లలోని తినే పదార్థాలకు ఎత్తుకెళ్లి ఇబ్బందికి గురిచేస్తున్నాయి. వాటిని తరిమేందుకు ప్రయత్నిస్తే దాడులు చేస్తున్నాయి. రోజు రోజుకూ గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వానరాల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



కేసిరెడ్డిపల్లిలో ఇంటిపై పెంకులను తొలగిస్తున్న కోతులు



బచ్చన్నపేటలోని ఓ ఇంట్లోని అన్నం తీసుకెళ్లి తింటున్న కోతి